క్లుప్తంగా

అసంపూర్తిగా వంతెన.. గ్రామస్తులకు తప్పని ఇక్కట్లు

దుంబ్రిగుడ: మండలంలోని కితలంగి పంచాయతీ పరిశీల గ్రామంలోని సంపంగి గెడ్డపై వంతెన అసంపూర్తిగా ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో గెడ్డలు పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న వంతెన వల్ల స్థానికులు పడుతున్న ఇబ్బందులను సర్పంచ్ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

వంతెన పనులు ప్రారంభించి సుమారు ఏడాది గడుస్తున్నా ఇప్పటికీ బిల్లులు చెల్లించకపోవడంతో పనులు కొంతమేరకే జరిగాయన్నారు. ఇప్పటి వరకు పనులు చేపట్టిన కాంట్రాక్టర్లుకు సంబంధిత అధికారులు తక్షణమే బిల్లులు చెల్లించాలన్నా రు. బిల్లులు సకాలంలో చెల్లిస్తే పూర్తిస్థాయిలో వంతెన నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి వెంటనే బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వెలుగు ఏపీఎంగా సాధన

కొయ్యూరు: వెలుగు ఏపీఎంగా సాధన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె అనకాపల్లి జిల్లా రోలుగుంట నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి ఏపీఎంగా పనిచేస్తున్న గాంధీని రాంబిల్లికి బదిలీ చేశారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆమె సిబ్బందితో మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

నేడు బూదరాళ్ల, మర్రివాడలో పొలం పిలుస్తోంది

కొయ్యూరు: మండలంలోని బూదరాళ్ల, మర్రివాడలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఏవో ఉమాదేవి సోమవారం తెలిపారు. దీనికి ప్రజాప్రతినిధులు కూడా హాజరు కావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖతో పాటు వెటర్నరీ శాఖ వైద్యులు, సిబ్బంది హాజరుకానున్నట్టు తెలిపారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



పడాల్‌పుట్టులో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

ముంచంగిపుట్టు: మండలంలోని కిలగాడ పంచాయతీ పడాల్‌పుట్టు గ్రామంలో ఎంపీపీ నిధులు రూ.9లక్షలతో చేపట్టనున్న రోడ్డు పనులకు సర్పంచ్ శివశంకర్, వైఎస్సార్‌సీపీ నేత జయదేవ్‌లు సోమవారం శంకుస్థాపన చేశారు. అధికారులు స్పందించి త్వరితగతిన రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరారు. వార్డు సభ్యుడు కిరణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ ఉబ్బన్న, నాయకులు ఆనందరావు, కామేష్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



గ్రామస్తులతో వైఎస్సార్‌సీపీ నేత బాలరాజు

దుంబ్రిగుడ: మండలంలోని కొర్ర పంచాయతీ పెద్దపాడు పీవీటీజీ గ్రామాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్.బాలరాజు సోమవారం సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో డ్రైనేజీ, రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు కోరారు. కూటమి ప్రభుత్వం ఆదివాసీ గ్రామాల అభివృద్ధిపై నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఆదివాసీ గ్రామాల్లో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు లేవన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి ఆదివాసీ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. గ్రామ పెద్దలు భీమరాజు, మోహనరావు, శంకర్‌రావు, సదానంద, లక్ష్మణ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ డ్రైవ్

జి.మాడుగుల: మండలంలో ఆధార్ ప్రత్యేక డ్రైవ్ ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో తేజ్‌రతన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ డ్రైవ్‌లో భాగంగా ఆధార్‌కార్డుల అప్‌డేట్, ఫోన్ నంబర్ లింక్, ఇతరత్రా వివరాల్లో మార్పుచేర్పులు చేయనున్నట్టు పేర్కొన్నారు. డ్రైవ్‌లో భాగంగా ఈ నెల 22, 23న కె.కోడాపల్లి, సొలభం-1, నుర్మతిలో, 24, 25 తేదీల్లో వంజరి, పెదలోచలి, భీరం పంచాయతీ కేంద్రాల్లో తాత్కాలిక ఆధార్ కేంద్రాలు ఏర్పాటుచేయనున్నట్టు తెలిపారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9676392974, 9390991099
సాక్షి



నిరుపయోగంగా ఉన్న ఉద్యానవన నర్సరీ శిక్షణ కేంద్రం



నర్సరీలో మొక్కలు

నాడు నందనవనం.. నేడు కళావిహీనం

- చింతపల్లిలో నిరుపయోగంగా ఉద్యోగ నర్సరీ శిక్షణ కేంద్రం
- రైతులకు అందని సూచనలు, సలహాలు
- ఉపాధి కోల్పోయిన సిబ్బంది

చింతపల్లి: మండల కేంద్రంలోని హార్టీకల్చర్ ఉద్యానవన నర్సరీలో శిక్షణ కేంద్రం నాడు నందనవనంగా ఉండేది.. రైతులకు ఉద్యాన పంటల సాగుపై విస్తృత అవగాహన కార్యక్రమాలు, శిక్షణ తరగతులు వంటివి జరిగేవి.. ఇక్కడి కేంద్రంలో పలు రకాల పండ్ల తోటలు ఉండేవి...అదంతా గతం.. నేడు ఈ కేంద్రం కళావిహీనంగా మారింది... రైతులకు ఎంతగానో ఉపయోగంగా ఉండే ఈ శిక్షణ కేంద్రం నిరుపయోగంగా మారడంతో గిరిజన రైతులు మదనపడుతున్నారు.

రైతులతో కళకళ

గిరిజన ప్రాంతంలో రైతులకు ఉద్యానవన పంటలపై సాగుపై అవగాహన కల్పించేందుకు 1985లో నర్సరీ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. గతంలో ఈ శిక్షణ కేంద్రం ద్వారా ఈ ప్రాంతంలో పండే అన్ని పంటలకు సంబంధించి రైతులకు పూర్తిస్థాయిలో శిక్షణలో భాగంగా గిరిజన రైతులకు పంటల సాగుపై సూచనలు, సలహాలు ఇచ్చేవారు. దీంతో పాటు ఉచితంగా మొక్కలను పంపిణీ జరిగేది. ఈ కేంద్రంలో సుమారు 35 ఎకరాల విస్తీర్ణంలో రైతులకు అవసరమైన వివిధ రకాల పంటలను పండించే వారు. నర్సరీల రూపంలో వివిధ రకాల ఉద్యానవన మొక్కలు ఉండేవి. ఈ శిక్షణ కేంద్రంలో ఏజెన్సీలో పండించే కాఫీ, మిరియాలు, సిల్వర్‌వోక్,



ఉద్యానవన నర్సరీ కేంద్రంలో పాడైన మోటార్

పైనాపిల్, బత్తాయి, కమల, జామ, సీతాఫలం తదితర పంటలను సాగు చేసేవారు. దీంతో పాటు ఆయా పంటలకు సంబంధించి మొక్కలను పంపిణీకి సిద్ధంగా ఉంచేవారు. ఆయా పంటలకు సంబంధించి పంటలు చేపట్టాలి అనే అంశాలపై పూర్తి శిక్షణ కార్యక్రమన్ని కూడా ఈ కేంద్రం ద్వారా నిర్వహించేవారు. ఈ నర్సరీ శిక్షణ కేంద్రం పలు రకాల పంటలతో పాటు అనేక రకాలైనటువంటి పూల తోటలు, పండ్ల తోటలకు ఎప్పుడు కళకళలాడుతూ ఉండేది. ఆ కేంద్రంలో పనిచేసే కార్మికులతో పాటు, ప్రైవేటు కార్మికులు సహా పలు రకాల నర్సరీలు పంటలలో నిమగ్నమై ఉండేవారు. ఐటీడీఏ అధికారులు తరచూ ఈ హార్టీకల్చర్ నర్సరీ శిక్షణ కేంద్రాన్ని సందర్శించేవారు. గతంలో చింతపల్లి మండం కేంద్రంలో ఏ పండుగ, సెలవులు వచ్చినా కుటుంబ సభ్యులతో కలిసి ఈ నర్సరీ కేంద్రాన్ని వెళ్లి ఆనందంగా గడిపే పరిస్థితి ఉండేది. ఉద్యాన పంటలపై విద్యార్థులకు ఈ కేంద్రంలో ఇంటర్న్‌షిప్ ట్రైనింగ్ ఇచ్చేవారు. ఈ శిక్షణ కేంద్రంలో వెలుగు సిబ్బంది, నాక్ వంటి సంస్థలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేవి. నిత్యం ఈ నర్సరీ కేంద్రం కళకళలాడుతూ ఉండేది... నందనవనంగా ఉన్న నర్సరీ కేంద్రం నేడు కళావిహీనంగా మారింది. ప్రస్తుతం ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో ఎవరు ముందుకొచ్చే పరిస్థితి లేదు. అంతే కాకుండా ఈ కేంద్రం స్థలం ఆక్రమణలకు గురైంది. ఈ శిక్షణ కేంద్రంపై ఉన్నతాధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో పరిస్థితి దయనీయంగా మారిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ, ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి కేంద్రం పునర్వైభవాన్ని తీసుకొచ్చి ఉద్యాన పంటల సాగుపై విస్తృతంగా రైతులకు అవగాహన శిక్షణ కార్యక్రమాలు చేయాలని కోరుతున్నారు.

ప్రతిపాదనల ఆమోదం



చింతపల్లి ఉద్యానవనని నర్సరీ శిక్షణ కేంద్రంలో నాలుగు లక్షల సిల్వర్‌వోక్ మొక్కలు పెంపకానికి ప్రతిపాదనలు విడుదల. త్వరలోనే ఈ శిక్షణా కేంద్రంలో నర్సరీలు పెంపుదలకు చర్యలు చేపడతాం. ఈ సిల్వర్‌ఓక్‌తో పాటు వాతావరణం అనుకూలమైనటువంటి బత్తాయి, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్ వంటి మొక్కల నర్సరీలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. త్వరలోనే కార్యరూపం దాల్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నాం.

– ఎస్ అశోక్, ప్రాజెక్టు ఉద్యానవన శాఖ అధికారి ఐటీడీఏ పాడేరు.

విద్యార్థుల చదువుపై ప్రత్యేక దృష్టి



సుజనపేట పాఠశాలలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంఈవో కృష్ణమూర్తి

ముంచంగిపుట్టు: చదువులో వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంఈవో కె.కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని సుజనకోట పంచాయతీ సుజనపేట జీయూపీఎస్ పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి వర్క్ బుక్స్‌ను పరిశీలించి, తప్పులను సరిదిద్దారు. విద్యార్థులకు బ్లాక్ బోర్డుపై లెక్కలను బోధించారు. పలుప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులకు అందిస్తున్న పీఎం పోషణను పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల ఆన్‌లైన్ హాజరు తప్పని సరిగా నమోదు చేయాలని, ఆన్‌లైన్ పనులను సైతం వెంటనే పూర్తి చేయాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని సూచించారు. బడిబయట పిల్లలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని, మధ్యాహ్న భోజనాన్ని పక్కాగా అమలు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలని ఎంఈవో కృష్ణమూర్తి ఉపాధ్యాయులకు ఆదేశించారు. ఆయన వెంట సీఆర్‌పీ అనిల్ ఉన్నారు.

మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



చింతూరులో మృతుడు అక్బర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి



ఎటపాకలో మృతుడు సర్వేశ్వరావు కుటుంబాన్ని ఓదారుస్తున్న మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

చింతూరు: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మండల కో–ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ అక్బర్‌అలీ మృతి పార్టీకి తీరనిలోటని మాజీ ఎమ్మెల్యే నాగుల పల్లి ధనలక్ష్మి అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అక్బర్ కుటుంబాన్ని ఆమె సోమవారం పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల్లో ఎంతో చురుగ్గా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి అక్బర్ ఎంతో కృషి చేశారన్నారు. అక్బర్ కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఎంపీపీ సవలం అమల, జెడ్పీటీసీ సభ్యుడు చిచ్చడి మురళి, సర్పంచ్ కారం కన్నారావు, పార్టీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి, శ్రీలత, కోట్ల కృష్ణ, విప్లవ్‌కుమార్, రాంప్రసాద్, కరీముల్లా, రాజు, మహేష్, ఖాదర్‌షరీఫ్, సాయిబాబా, రంపచోడవరం మండల కన్వీనర్ జల్లి రామన్నదొర ఉన్నారు.

వీఆర్ పురంలో..

మండలంలోని రేఖపల్లిలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పట్టెల సీతయ్య కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆర్థికసాయం అందించారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. పార్టీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు, మాచర్ల గంగయ్య, చిక్కాల బాలు, బొడ్డు సత్యనారాయణ, గౌతమ్, వెంగళరావు, కాంతారావు పాల్గొన్నారు.

ఎటపాక: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పప్పుల సర్వేశ్వరరావు కుటుంబాన్ని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సోమవారం పరామర్శించారు.ఎటపాక గ్రామం వచ్చిన ధనలక్ష్మి నేరుఅ సర్వేశ్వరరావు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేశ్వరరావు వైఎస్సార్‌సీపీకి చేసిన సేవలు మరువలేనివన్నారు. నాయకులు దామెర్ల రేవతి, కురినాల వెంకట్, నెల్లిపాక ఎంపీటీసీ సభ్యురాలు అంజలి, రాంప్రసాద్, నాగలక్ష్మి, లక్ష్మి, చల్లా మణి, వెంకటేష్ తదితరులున్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



వంగతోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ క్రాంతికుమార్

రంపచోడవరం: రైతులు సస్యరక్షణ చర్యలతో పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని పందిరి మామిడి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, డాక్టర్ కె.రాజేంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని చీడిపాలెం, చెరువుపాలెం, గజ్జివెలగల, పందిరివీధి, కుంజంవీధి గ్రామాల్లో వంగ, కర్రపెండలం పొలాలను ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ టి క్రాంతికుమార్‌తో కలిసి క్షేత్ర స్థాయి సందర్శన చేశారు. ఈ సందర్శనలో వంగ తోటల్లో వంగలో కాయ, కాండం తొలుచు పురుగు, రసం పీల్చే పురుగుల ఉధృతిని గమనించారు. వంగలో ఎండు తెగులును పరిశీలించారు. వంగ తోటల్లో రైతుల చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. కర్రపెండలం తోటల్లో మొసాయిక్ వైరస్ తెగులు సోకడాన్ని గుర్తించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు తెలియజేశారు. పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

సదరం క్యాంపులు ఏర్పాటు చేయాలని డిమాండ్



మాట్లాడుతున్న బాలదేవ్

అరకులోయ రూరల్: దివ్యాంగుల కోసం సదరం క్యాంపులు నిర్వహించడంలో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ చెప్పారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ సదరం క్యాంపులకు సంబంధించి అరకులోయ, పాడేరు ప్రాంతాల్లో దివ్యాంగులు సదరం నమోదు కోసం ప్రయత్నిస్తున్నారన్నారు. సదరం వెబ్‌సైట్‌లో సమస్యలుండడంతో అరకు, పాడేరు ప్రాంతాలకు చెందిన దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకొని వెబ్‌సైట్ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. నాయకులు బాలరాజు, జొయ్యో తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన



పోషకాహార వంటల ప్రదర్శన

కొయ్యూరు: మండలంలోని కాకరపాడు అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీవో విజయకుమారి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా సామూహిక సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునగాకుతో చేసిన గారెలు, ఇతరత్రా సుమారు 15రకాల వంటలను ప్రదర్శించారు. మునగాకు వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. సెక్టార్ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మన్యంలో భారీ వర్షం





జి.మాడుగుల, కొయ్యూరులో కురుస్తున్న వర్షం

జి.మాడుగుల/కొయ్యూరు/రాజవొమ్మంగి: మన్యంలో పలుచోట్ల సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం మండుటెండతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నం 2గంటల తరువాత భారీ వర్షం కురిసింది. రహదారులు జలమయమయ్యాయి. కొయ్యూరులో ఉరుములు మెరుపులతో వర్షం కురవడంతో సుమారు నాలుగు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. పెద్ద పెద్ద శబ్దాలతో పిడుగులు పడడంతో స్థానికులు ఆందోళన చెందారు. రాజవొమ్మంగిలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. జనజీవనం స్తంభించింది. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల పిల్ల కాలువలు పొంగి ప్రవహించాయి. వట్టిగెడ్డ రిజర్వాయర్ పొర్లుమదుము ద్వారా పొంగి ప్రవహించింది. ప్రస్తుతం కురిసిన వర్షం పంటలకు ఎంతో మేలు కలుగుతుందని రైతులు చెప్పారు.

ఐక్య క్రిస్మస్ పోస్టర్ ఆవిష్కరణ



ఐక్య క్రిస్మస్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న పాస్టర్లు తదితరులు

అరకులోయటౌన్: అరకులోయలో డిశంబర్ 12న ఐక్య క్రిస్మస్ నిర్వహించనున్నట్టు యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్ష, కార్యదర్శులు రెవరెండ్ వంతాల ప్రసాద్ పాల్, రెవరెండ్ బి.ఇ.సంజీవ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని సోమవారం జరిగిన కార్యక్రమంలో ఐక్య క్రిస్మస్ వేడుక పోస్టర్, ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా అరకులోయలో అత్యంత ఘనంగా నిర్వహించే ఐక్య క్రిస్మస్ ఈ ఏడాది కూడా అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అరకులోయలోని రైల్వే రిక్వస్ట్ స్టేజీ సమీపంలోని చర్చ్ ఆఫ్ హోలీ గాడ్ ఆవరణలో నిర్వహించే ఈ కార్యక్రమానికి విజయవాడలోని క్రైస్ట్ టెంపుల్ పాస్టర్ రెవరెండ్ పాల్ ఇమ్మానుయేల్ ముఖ్య అతిథిగా పాల్గొని దైవ సందేశాన్ని అందిస్తారన్నారు. అధిక సంఖ్యలో క్రైస్తువులు వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఎంపీడీవో లవరాజు

అరకులోయ రూరల్: మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో లవరాజు అధ్యక్షతన సచివాలయ విద్యాశాఖ, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామస్థాయిలో ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో రక్షిత తాగునీరు అందించే దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల అవసరాలపై ప్రత్యేకంగా కృషి చేసి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఎంఈవో త్రినాథ్‌రావు, సీడీపీవో శారద, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ట



పూజలు చేస్తున్న భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు

జి.మాడుగుల: మండలంలో వంజరి పంచాయతీ గొప్పులపాలెం గ్రామంలో తిరుమల తిరుపతి శ్రీవాణీ ట్రస్టు నిధులతో దేవాదాయ ధర్మాధాయ శాఖ సహకారంతో నిర్మించిన రామాలయంలో విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో సోమవారం భక్తిశ్రద్ధలతో సీతారామచంద్రుల విగ్రహాల ప్రతిష్ట జరిగింది. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. విశ్వశాంతి హోమం నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి పూజల్లో పాల్గొన్నారు. అర్చకులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు. దేవదాయ ధర్మదాయ శాఖ ఏఈ సతీష్‌కుమార్, విశ్వహిందూపరిషత్ జిల్లా ధర్మప్రసార ప్రముఖ్ అప్పలరాజు, భజరంగదల్ ప్రముఖ్ సన్యాసినాయుడు, అర్చకులు కృష్ణ, భీమన్న, చైతన్య, ధర్మరాజు,గణపతి, కరాటే అసోసియేషన్ స్టూడెంట్స్ కోపుకాన్ కరాటే క్లబ్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ పాండురాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ యువతకు న్యాయం చేయాలి



నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

చింతూరు: 2024 డీఎస్సీలో జీవో నెం 3ను అమలు చేయాలని మండలంలోని కల్లేరు గ్రామస్తులు డిమాండ్ చేశారు. డీఈడీ, బీఈడీ అభ్యర్థులతో కలసి సోమవారం గ్రామంలో వారు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెం–3 అమలు కాకపోవడంతో స్థానికులకు దక్కాల్సిన ఉద్యోగాలు మైదాన ప్రాంతాలకు చెందిన గిరిజనేతరులకు దక్కుతున్నాయని తెలిపారు. దీనివలన స్థానిక ఆదివాసీ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సోడె మురళి మాట్లాడుతూ వచ్చేనెల 15న బిర్సాముండా జయంతి సందర్భంగా నిర్వహించనున్న సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సోడె పాదయ్య, పాడియం నారాయణ, రాజు, రాఘవయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

మెనూ అమలులో నిర్లక్ష్యం తగదు



విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీపీ వరహాలమ్మ

పెదబయలు: మండల కేంద్రంలోని ఏపీ గురుకుల రెసిడెన్సియల్ బాలుర పాఠశాలను ఎంపీపీ బొండా వరహాలమ్మ సోమవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల, డార్మెటరీలు, మరుగుదొడ్లను పరిశీంచారు. డార్మెటరీలు శుభ్రంగా లేకపోవడం, మరుగుదొడ్ల పరిస్థితి అధ్వానంగా ఉండడంతో హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉండడంతో బహిర్భూమికి ఆరుబయట వెళ్తున్నామని, సమీప తుప్పలోల పాములతో భయంగా ఉందని పలువురు విద్యార్థులు ఎంపీపీకి తెలియజేశారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. విద్యార్థులకు ఇస్తున్న ఆహారంలో నాసిరకండా ఉండడం, ఉపాధ్యాయులకు మాత్రం ప్రత్యేకంగా వంటలు వండడాన్ని గుర్తించినట్టు చెప్పారు. భోజనాన్ని విద్యార్థులు కంటే ముందుగానే ఉపాధ్యాయులు పెట్టడాన్ని కూడా గమనించామన్నారు. ప్రభుత్వం పౌష్టికాహారంతో కూడిన మెనూ అందిస్తున్నా ఎందుకు అమలు చేయడం లేదని ఉపాధ్యాయులను ఎంపీపీ వరహాలమ్మ ప్రశ్నించారు. పాఠశాల విషయాలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. సీతగుంట సర్పంచ్‌లు పలాసి మాధవరావు, మత్స్యరాజు ఎంపీటీసీ సభ్యులు కిమంకరి బొంజుబాబు, మత్స్యకొండబాబు, వీఆర్వో ఆజాద్, ఉప సర్పంచ్ గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ



శబరి కొత్తగూడెంలో గ్రామస్తులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కూనవరం: మండలంలోని శబరి కొత్తగూడెం గ్రామాన్ని ఎస్‌ఐ లతశ్రీ సోమవారం సందర్శించారు. గ్రామంలో స్థానికులకు ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ సమకూర్చిన నిత్యావసర సరకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ గోదావరి వరదలు వంటి విపత్తుల సమయంలో ప్రజలకు అనేక సేవలు అందించినట్టు తన దృషికి వచ్చిందన్నారు. సంస్థ డైరెక్టర్ ఉండవల్లి గాంధీబాబు మాట్లాడుతూ వరదలు, వర్షాల మూలంగా సీజనల్ వ్యాధులు ప్రబలు కుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మొత్తం 306 కుటుంబాలకు పది కిలోల బియ్యం, మూడు కిలోలు కందిపప్పు, బెడ్‌షీట్లు, టవళ్లు, దుప్పట్లతో కూడిన కిట్‌లను అందజేశారు. ఆమె మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ కట్టం లక్ష్మి, గాంధీబాబు, దివ్యాంగుల సంఘం కో–ఆర్డినేటర్ నెరపటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గుర్తేడులో వైద్య శిబిరం

రంపచోడవరం: వై.రామవరం మండలం ఎగువ ప్రాంతంలోని నాలుగు పంచాయతీల్లో గిరిజనులు వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించే విధంగా ప్రత్యేక మెడికల్ క్యాంపును ఏర్పాటు చేస్తున్నట్లు పీవో కట్టా సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తేడు గ్రామంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో మంగళవారం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. గుర్తేడు, పాతకోట, దారగెడ్డ, బొడ్డగండి పంచాయతీల పరిధిలోని గ్రామాల గిరిజనులు వివిధ వ్యాధులతో బాధ పడుతున్న వారు ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకొని, ఉచితంగా మందులు పొందవచ్చన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేసి, మెరుగైన వైద్య సేవలు కోసం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలిస్తామన్నారు. వైద్య శిబిరం కోసం ముగ్గురు వైద్యులను నియమించినట్లు తెలిపారు. వైద్యశిబిరం పర్యవేక్షణ కోసం ఏడీఎంహెచ్‌వో డాక్టర్ శిరీషను నియమించినట్టు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాడేరు డివిజన్:
9010973030, 9010234557
Office mail : sakshiadvtvsp@gmail.com